# పాడి రైతు పోరు.. తలొగ్గిన సర్కారు

- సిరిసిల్ల జిల్లాలో 'అధికార' జులుం
- నోటీస్ ఇవ్వకుండానే డెయిరీ సీజ్
- 20వేల రైతు కుటుంబాలకు నష్టం
- పాలకేంద్రాల వద్ద నిరసనలు
- దిగొచ్చిన అధికారులు..కేంద్రం ఓపెన్

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ)/వేములవాడ రూరల్: సిరిసిల్ల పాడిరైతుల పోరాటంతో ఎట్టకేలకు సర్కార్ దిగొచ్చింది. రైతుల ఆగ్రహం చల్లారింది. సుమారు 20 వేల మందికి జీవనాధారమైన అగ్రహారం పాలశీతలీకరణ కేంద్రాన్ని సీజ్ చేయడంపై గురువారం పాడిరైతులు భగ్గుమన్నారు. పాలకేంద్రం ఎదుట హైవేపై వందలాది మంది రైతులు చేరి సుమారు 3 గంటలకు పైగా రాస్తారోకో నిర్వహించారు. రాత్రి సమయంలో గ్రామాల్లోని పాలకేంద్రాల వద్ద నిరసనలకు దిగారు. పలు చోట్ల పాలు పారబోసి రైతు కుటుంబాలు ఆందోళనలకు దిగారు. ఆఖరికి రైతుల పోరాటంతో దిగొచ్చిన అధికారులు.. రాత్రి 9 గంటలకు మళ్లీ పాలకేంద్రాన్ని తెరిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం చంద్రగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని అగ్రహారం వద్ద కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ పాలశీతలీకరణ కేంద్రాన్ని అధికారులు ఎలాంటి నోటీస్ ఇవ్వకుండానే సీజ్‌చేశారు. ఇది అధికార యంత్రాంగం కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని, అధికార పార్టీ నేతల కనుసైగతోనే ఇలాంటి కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినదించారు. దాదాపు మూడు గంటలపాటు ధర్నా చేయగా, అరకిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, డీఆర్డీఏ శేషాద్రి అక్కడి చేరుకొని సముదాయించే ప్రయత్నం చేయగా ఒక్కసారిగా రైతులు భగ్గుమన్నారు. ఎటువంటి నోటీసు ఇవ్వకుండానే పాలకేంద్రాన్ని ఎలా సీజ్ చేస్తారని, తామెక్కడ పాలు పోయాలని అధికారులను నిలదీశారు. ఏం సమాధానం చెప్పలేక అధికారులు నీళ్లు నమిలారు. రైతులు అడిగిన ఏ ఒక్క ప్రశ్నకూ సమాధానం చెప్పలేకపోయారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని, విజయ డెయిరీకి పోయాలని ఆర్డీవో రాజేశ్వర్ సూచించగా, రైతులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విజయడెయిరీకి తామెందుకు పాలు పోయాలని నిలదీశారు. బయటనైనా పారబోస్తాంగానీ, విజయ డెయిరీకి పోసేది లేదని తేల్చిచెప్పారు. రాజకీయ కక్షతోనే అధికారులు తమ పాలకేంద్రాన్ని సీజ్ చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని రైతులను పోలీసులు దౌర్జన్యంతో బలవంతంగా ఈడ్చుకెళ్లి రోడ్డుపక్కన పడేశారు. అయినా రైతులు వాహనాలకు అడ్డుపడగా, పోలీసులు అడ్డుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో సీల్ తొలగిస్తున్న అధికారులు

ఆ తర్వాత అధికారులందరూ అక్కడి నుంచి వెళ్లిపోగా, పాలకేంద్రం వద్దకు ఎవరినీ రానివ్వకుండా కొందరు పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు.

### ఊరూరా నిరసనల హోరు

పాడి రైతులకు ఇంత అన్యాయం జరుగుతున్నా ఉదయం నుంచి రాత్రి వరకు అధికారులు దిగిరాక, అధికార పార్టీ నేతలు నోరెత్తకపోవడంతో రైతుల్లో ఆగ్రహం పెల్లుబికింది. సీజ్ చేసిన విషయం తెలుసుకున్న వందలాది మంది పాడి రైతులు ఆగ్రహంతో రగిలిపోయారు. ఊరూరా ఉన్న పాలకేంద్రాల వద్ద ఎక్కడికక్కడ రాత్రివేళ ఆందోళనకు దిగారు. చాలా చోట్ల రైతులు తమ పాలను రోడ్డుపై పారబోసి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శుక్రవారం నాటికి ఆందోళన మరింత తీవ్రం చేయాలని, కలెక్టరేట్‌ను ముట్టడించాలని రైతులు నిర్ణయించారు. రాత్రి 9 గంటలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో పంచాయతీ కార్యదర్శి సీజ్‌ను తొలగించి.. చిల్లింగ్ సెంటర్‌ను తెరిపించారు. ఇది ఇలాగే కొనసాగుతుందా? లేదా మళ్లీ రైతుల ఆగ్రహం చల్లబడగానే మళ్లీ సీజ్ చేస్తారా? అన్న దానిపై మాత్రం స్పష్టత లేదు.

### 20 ఏండ్లుగా పాల సేకరణ

రాజన్న సిరిసిల్ల జిల్లా పాడి రైతులకు సేవలందిచాలన్న లక్ష్యంతో కరీంనగర్ డెయిరీ వేములవాడ రూరల్ మండలం చంద్రగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని అగ్రహారం వద్ద 2005లో మిల్క్ చిల్లింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ స్థలాన్ని, షెడ్డునూ డెయిరీ సొంతంగా ఏర్పాటు చేసింది కాదు. 2005లో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ వేలం వేయగా, ఆ వేలంలో డెయిరీ దానిని కొనుగోలు చేసింది. ఆ మేరకు చిల్లింగ్ కేంద్రానికి అవసరమయ్యే విధంగా వసతులు, యంత్రాలను సమకూర్చుకొని కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో ఈ చిల్లింగ్ కేంద్రాన్ని నడుపుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 145 గ్రామాల నుంచి పాలను సేకరిస్తున్నారు. నిత్యం 48,000 లీటర్లను సుమారు 20 వేల మంది పాడి రైతు కుటుంబాల నుంచి సేకరించి, వాటిని చిల్లింగ్ చేస్తున్నారు. 20 ఏండ్లుగా ఈ ప్రాంత రైతులకు ఈ చిల్లింగ్ కేంద్రం సేవలందిస్తున్నది. దీంతో ఈ జిల్లాలో వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నది.

### అధికారుల జబర్దస్తీ!

రెండురోజుల క్రితం మిల్క్ చిల్లింగ్ కేంద్రం ప్రహరీ ముందు భాగాన్ని కూల్చివేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక అడుగు ముందుకొచ్చిదని చెప్పారు. అయితే గోడకు ముందు ప్రభుత్వ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నది. దానికి దాదాపు రెండు అడుగుల వెనక్కి ఈ ప్రహరీ ఉన్నది. ట్రాన్స్‌ఫార్మర్‌ను అలాగే ఉంచి ఎటువంటి నోటీస్ ఇవ్వకుండానే ప్రహరీని కూల్చివేశారు. ఎందుకు కూల్చివేశారో చెప్పాలంటూ డెయిరీ సిబ్బంది అధికారులను అడిగినా నేటివరకు లిఖితపూర్వకంగా సమాధానమే చెప్పలేదు. ఇదిలా ఉండగా గురువారం ఉదయం వేములవాడకు చెందిన మున్సిపల్ అధికారులు, జిల్లా పంచాయతీ, పరిశ్రమ అధికారులు వచ్చి ఏకంగా కేంద్రాన్నే సీజ్‌చేశారు. ఎందుకు సీజ్ చేస్తున్నారో చెప్పాలని అక్కడి సిబ్బంది ప్రశ్నించినా సమాధానం చెప్పలేదు. 'కొంత గడువు ఇవ్వండి. 20 వేల లీటర్ల పాలు ఉన్న ట్యాంకర్ లోపల ఉన్నది. వాటిని తీసుకెళ్లడానికి అవకాశం ఇవ్వండి' అని కోరినా ఏమాత్రం పట్టించుకోకుండానే సీజ్ చేశారు. ఈ విషయంపై తీవ్ర విమర్శలు రావడంతో తర్వాత మళ్లీ ట్యాంకర్‌ను బయటకు పంపించడం గమనార్హం.



సిరిసిల్ల-కరీంనగర్ రహదారి పై ధర్నా చేస్తున్న పాడిరైతులు

### నిబంధనలకు నీళ్లు

తమకు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వలేదని, కనీస సమాచారం ఇవ్వకుండానే అధికారులు సీజ్ చేశారని డెయిరీ అధికారులు చెప్తున్నారు. తాము నోటీసులు ఇస్తే తీసుకోలేదని, అలాగే చిల్లింగ్ కేంద్రం నడిపేందుకు తగిన అనుమతులు లేకపోవడం వల్ల సీజ్ చేశామని చంద్రగిరి పంచాయతీ కార్యదర్శి నరేశ్ మీడియాకు వెల్లడించారు. అధికారులు చెప్పినట్టుగా నిజంగానే ఒకవేళ చిల్లింగ్ కేంద్రం నిర్వాహకులు నోటీసులను తిరస్కరిస్తే.. సదరు నోటీసులను కేంద్రం గోడలపై లేదా గేటుపై అతికించే అవకాశం అధికారులకు ఉంటుంది. కానీ, అలా చేయనేలేదు. చిల్లింగ్ కేంద్రం నడిపేందుకు అనుమతి లేదంటూ అధికారులు పత్రిక ప్రకటన విడుదల చేయవచ్చు. ఇటువంటి చర్య కూడా తీసుకోలేదు. అంటే పైస్థాయి అధికారుల ఒత్తిళ్లకు లోనై నోటీసులు ఇస్తే తిరస్కరించినట్టుగా కిందిస్థాయి సిబ్బంది అబద్ధాలు చెప్తున్నారనేది స్పష్టమవుతున్నది. గడిచిన 20 ఏండ్లుగా చిల్లింగ్ కేంద్రం నిర్వాహకులు పంచాయతీ కార్యాలయానికి ఏటా పన్ను చెల్లిస్తున్నారు. లోతుగా చూస్తే ఇదంతా అధికార పార్టీ కనుసన్నల్లోనే జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.